

లక్ష్యానికి మించి పత్తి సాగు

జిల్లాలో అధికారుల అంచనాలకు మించి పత్తి సాగు కాగా.. గత ఏడాది కంటే కూడా ఎక్కువగా పంట సాగు నమోదైంది. 10లో



డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ

నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేసేలా ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ అనుదీప్ ఆదేశించారు. 10లో



వాతావరణం

జిల్లాలో బుధవారం ఉదయం మొదలయ్యే ఉష్ణోగ్రత మధ్యాహ్నానికి గరిష్టస్థాయికి చేరుతుంది. ఉక్కపోత వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

జమలాపురంలో ముగిసిన పవిత్రోత్సవాలు



శ్రీవారిని చక్రస్నానానికి తోడ్కొని వెళ్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీవారి పాదానికి పంచామృతంతో అభిషేకం నిర్వహించాక మూలవరులు, ఉపాలయాల్లో దేవతల పవిత్రాలను విసర్జన చేశారు. అలాగే, యాగశాలలో మహాపూర్ణాహుతి, స్వామి వారికి చక్ర స్నానం నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ జగన్మోహన్‌రావు, అర్చకులు మురళీమోహన్‌శర్మ, రాజీవ్‌శర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుండి సదరమ్ క్యాంపులు

ఖమ్మంవైద్యవిభాగం: దివ్యాంగులకు సదరమ్ సర్టిఫికెట్లు జారీ చేసేందుకు క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎం.నరేందర్ తెలిపారు. ఈనెల 7, 12, 14, 19, 21, 23, 26, 28, 30వ తేదీల్లో క్యాంపులు ఉంటాయని వెల్లడించారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైకల్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దివ్యాంగులు స్లాట్ బుక్ చేసుకున్న రశీదుతో పాటు ఆధార్ కార్డ్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, వైద్యపరీక్షల రిపోర్టులతో హాజరుకావాలని సూచించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: గ్రూప్స్, ఆర్ఆర్‌బీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ తదితర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులకు రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ ద్వారా నాలుగు నెలల పాటు ఫౌండేషన్ శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి ఉన్న ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీ అభ్యర్థులు ఈనెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ బి.పురంధర్ తెలిపారు. విద్యార్హతల సర్టిఫికెట్లు జతచేసిన దరఖాస్తులను కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో సమర్పించాలని సమర్పించాలని ఆయన సూచించారు.

హెచ్‌పీఎస్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్ బేగంపేట, రామంతాపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూళ్లలో ఒకటో తరగతిలో ప్రవేశానికి ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరానికి జిల్లాకు రెండు సీట్లు కేటాయించగా, ఈనెల 8వ తేదీ లోపు తమ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు. జనన, కుల, ఆదాయ, స్థానికత ధ్రువపత్రాలతో పాటు రేషన్, ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలను గెజిటెడ్ అధికారి అటెస్టేషన్‌తో దరఖాస్తుకు జతచేయాలని తెలిపారు. ఈనెల 10న డ్రా ద్వారా ఇద్దరిని ఎంపిక చేస్తామని డీడీ వెల్లడించారు.


ఇన్‌చార్జ్ డీఈఓగా బాధ్యతల స్వీకరణ



నాగపద్మజకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉద్యోగులు, నాయకులు

ఖమ్మం సహకారనగర్: జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగపద్మజ మంగళవారం డీఈఓ కార్యాలయంలో ఇన్‌చార్జ్ డీఈఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఈఓ కార్యాలయ ఉద్యోగులు ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కట్టా శేఖర్‌రావు ఆధ్వర్యాన నాయకులు సైతం ఇన్‌చార్జ్ డీఈఓను కలిశారు. పదోన్నతుల ప్రక్రియను పొరపాట్లు జరగకుండా పూర్తిచేయాలని కోరారు. పీఆర్‌టీయూ నాయకులు గుడిపుడి శ్రీనివాసరావు, చావా శ్రీనివాసరావు, లింగం సతీష్, పుసులూరి శ్రీనివాసరావు, శాంతారెడ్డి పాల్గొన్నారు.

చిక్కుముడులు విప్పుతూ...



భూభారతి దరఖాస్తుల పరిష్కారంపై కసరత్తు

- 25,408 అర్జీలపై ఇప్పటికే నోటీసుల జారీ
- మిగతా వాటి పరిశీలనపై యంత్రాంగం దృష్టి
- ఈ నెలాఖరు నాటికి మార్పులు, చేర్పులు పూర్తి

రెవెన్యూ సదస్సుల ద్వారా అందిన దరఖాస్తులు

మొత్తం దరఖాస్తులు	75,004
సాదాబైనామా, ఇతరత్రా	40,872
ఇతర అంశాలపై..	8,724
నోటీసుల జారీ	25,408
ఇప్పటివరకు పరిష్కారం	195

భూ సమస్యల చిక్కుముడులు ఒక్కటొక్కటిగా వీడుతున్నాయి. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి చట్టం స్థానంలో ప్రస్తుత ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ మేరకు రెవెన్యూ సదస్సుల ద్వారా దరఖాస్తులు స్వీకరించగా.. జిల్లాలో అందిన 75,004 దరఖాస్తుల పరిష్కారానికి రెవెన్యూ యంత్రాంగం కృషి చేస్తోంది. ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తులన్నీ క్లియర్ చేయాలనేది లక్ష్యమైనా.. సమస్యలు ఎక్కువగా ఉండడం, సిబ్బంది కొరత కారణంగా ఈ నెలాఖరు వరకు దరఖాస్తులకు మోక్షం కలిగే అవకాశం కనిపిస్తోంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

అన్నీ కలిపి 75,004..

భూభారతి అమలుకు పైలట్‌గా తొలుత నేలకొండపల్లి, ఆతర్వాత బోనకల్ మండలం... ఆపై అన్ని మండలాలను ఎంపిక చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 14 నుంచి జూన్ 3వరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 21 మండలాల నుంచి 75,004 దరఖాస్తులు అందాయి. అత్యధికంగా కారేపల్లి మండలంలో 6,199, కొణిజర్ల మండలంలో 5,535, పెనుబల్లి మండలంలో 5,139, కల్లూరు మండలంలో 4,986, ఏన్కూరులో 4,980, తల్లాడలో 4,786, కామేపల్లి మండలంలో 4,709 దరఖాస్తులు అందగా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయించారు. అయితే, మొత్తం దరఖాస్తుల్లో సాదాబైనామాకు సంబంధించి 40,872 ఉన్నప్పటికీ హైకోర్టు తీర్పు తర్వాతే వీటి విషయంలో ముందుకు సాగే అవకాశముంది.

అనేక సమస్యలు

రైతులు పలు రకాల భూసమస్యలపై దరఖాస్తులు సమర్పించారు. సర్వే నంబర్లు తప్పుగా పడడం, ఇంటి పేరు, భూ యజమాని పేరు, అసలు విస్తీర్ణం తక్కువగా చూపడం, నిషేధిత భూముల జాబితాలో పట్టా భూమి నమోదు కావడం, మ్యుటేషన్, అసైన్డ్ పట్టా, వారసత్వ పట్టా ఇలా పలు సమస్యలు ఉండడంతో క్షేత్ర స్థాయిలో రెవెన్యూ యంత్రాంగం పరిశీలిస్తోంది. భవిష్యత్‌లో మరోమారు వివాదం తలెత్తవద్దనే భావనతో పరిశీలిస్తూ శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

పరిశీలన.. నోటీసులు

సాదాబైనామా మినహా మిగతా దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్న ఉద్యోగులు నోటీసులు కూడా జారీ చేస్తున్నారు. ఇప్పటి వరకు 25,408 దరఖాస్తులకు సంబంధించి నోటీసులు ఇవ్వగా, 669 దరఖాస్తులు పరిష్కారమయ్యాయి. ఈనెల 15వ తేదీ నాటికి అన్ని దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసి.. నోటీసులు ఇవ్వడం, ఆపై అందే సమాధానం ఆధారంగా పరిష్కారంపై ముందుకు వెళ్లనున్నారు.

పకడ్బందీగా పరిశీలన, పరిష్కారం..



భూభారతిలో వచ్చిన దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది. సాదాబైనామా దరఖాస్తుల అంశం హైకోర్టు పరిధిలో ఉండడంతో ప్రభుత్వ మార్గదర్శకాలు వచ్చాక చర్యలు తీసుకుంటాం. మిగిలిన దరఖాస్తుల్లో సర్వేనంబర్లు, పేర్లు తప్పుగా నమోదవడం, సర్వే నంబర్ లేకపోవడం వంటి సమస్యలు ఉండడంతో మొదటి, రెండు పేజీల్లో తప్పుల సవరణకు సిద్ధం చేస్తున్నాం. వారసత్వ పట్టాలకు సంబంధించి కొందరికి నోటీసులు ఇవ్వాల్సి ఉంది. ఎవరివైనా దరఖాస్తులు తిరస్కరించినా అందుకు కారణాన్ని తెలియజేస్తూ.. మిగిలిన దరఖాస్తులు వీలైనంత త్వరగా పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నాం.

– అనుదీప్ దురిశెట్టి, కలెక్టర్, ఖమ్మం

అనుబంధానికి ఆర్టీసీ చేయూత!

- రాఖీ పండుగకు అదనపు సర్వీసులు
- ఖమ్మం రీజియన్‌లో 111 బస్సుల ఏర్పాటు

ఖమ్మంమయూరిసెంటర్: సోదరులకు రాఖీ కట్టేందుకు వచ్చివెళ్లే మహిళలతో రాఖీ పండుగకు రెండు రోజుల ముందు నుంచే బస్సుల్లో రద్దీ పెరగనుంది. ఈమేరకు ముందస్తు ఏర్పాట్లపై ఆర్టీసీ అధికారులు దృష్టి సారించారు. రద్దీకి అనుగుణంగా ఈనెల 7నుంచి 11వ తేదీ వరకు ఖమ్మం రీజియన్‌లోని ఏడు డిపోల నుంచి 111అదనపు సర్వీసులు నడిపించాలని నిర్ణయించారు.

వరుస సెలవులు

రాఖీ పౌర్ణమి రెండో శనివారమైన 9వ తేదీన వచ్చింది. పాఠశాలలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు సెలవు ఉండడం, ముందు రోజు కూడా శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా మహిళా ఉద్యోగులు సెలవు పెట్టి స్వగ్రామాలకు వెళ్లనున్నారు. ఇక పండుగ తర్వాత ఆదివారం రావడంతో మూడు రోజులు స్వస్థలాల్లో గడిపేలా కుటుంబాలతో సహా వెళ్లే అవకాశముంది. దీంతో 7వ తేదీ నుంచే అధికారులు ప్రత్యేక సర్వీసులు(అదనపు బస్సులు) నడపాలని నిర్ణయించారు. హైదరాబాద్ నుంచి ఉమ్మడి జిల్లాకు వచ్చే ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో అదనపు బస్సులన్నీ ఈ రూట్‌లోనే నడిపేలా కార్యాచరణ సిద్ధం చేశారు.

రిజర్వేషన్.. అదనపు చార్జీ?

రోజూ నడిచే సర్వీసులకు తోడు ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు డిపోల నుంచి అదనంగా 111 బస్సులు నడపిస్తారు. అయితే, అదనపు సర్వీసుల్లో రిజర్వేషన్ అమలు చేయడమే కాక సాధారణ చార్జీ కంటే అదనంగా వసూలు చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈమేరకు 60 బస్సుల్లో రిజర్వేషన్, మిగతా బస్సులు బస్సులను రిజర్వేషన్ లేకుండా నడపాలని నిర్ణయించారు. ఈనెల 7నుంచి 9వ తేదీ వరకు హైదరాబాద్ నుండి ఉమ్మడి జిల్లాకు, 10, 11వ తేదీల్లో ఉమ్మడి జిల్లా నుండి హైదరాబాద్‌కు ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయి. అత్యధికంగా ఖమ్మం డిపో నుంచి 24 ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేస్తుండగా, మధిర, భద్రాచలం నుంచి 19చొప్పున, సత్తుపల్లి నుంచి 17, మణుగూరు నుంచి 14, కొత్తగూడెం నుంచి 11, ఇల్లెందు డిపో నుంచి ఏడు బస్సుల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించారు.

రద్దీకి అనుగుణంగా బస్సులు



రాఖీ పండుగకు వచ్చివెళ్లే ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేస్తున్నాం. ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఈ బస్సులు నడుపుతాం. బస్టాండ్లలో ప్రయాణికులకు సమాచారం ఇచ్చేలా ప్రత్యేక సిబ్బందిని నియమిస్తున్నాం.

– ఏ.సరిరామ్, ఆర్ఎం, ఖమ్మం రీజియన్

కాంగ్రెస్ అబద్ధాలను ప్రజలు నమ్మరు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్

ఖమ్మంమయూరిసెంటర్: కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అసత్య ప్రచారాలు, అబద్ధపు మాటలను రాష్ట్ర ప్రజలు నమ్మరని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. ప్రాజెక్టుపై హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు మంగళవారం ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ఖమ్మంలో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు వీక్షించారు. ఈ సందర్భంగా తాతా మధు మాట్లాడుతూ కాళేశ్వరంపై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. తొలుత తెలంగాణ ఉద్యమానికి మద్దతు అందించిన జార్ఖండ్ రాష్ట్ర సాధకుడు శిబూ సోరేన్ మృతిపై సంతాపం తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బానోతు చంద్రావతి, జెడ్పీ, డీసీసీబీ మాజీ చైర్మన్లు లింగాల కమల్‌రాజ్, కూరాకుల నాగభూషణం, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, దండా జ్యోతిరెడ్డి, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు గుండాల కృష్ణ, ఎం.డీ.ఖమర్, బెల్లం వేణుగోపాల్, వీరూనాయక్, పెంట్యాల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మధు

మిర్చి ధరలో పురోగతి

ఖమ్మంవ్యవసాయం: మిర్చి ధర కొంత మేర పెరిగింది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం క్వింటాకు రూ.14,350 ధర పలికింది. పంట సీజన్ ఫిబ్రవరిలో గరిష్ఠంగా రూ.14,200 పలకగా, ఏప్రిల్ మూడో వారం వరకు రూ.13,500, ఆపై రూ.12,200కు పడిపోయింది. జూన్‌లో అదే పరిస్థితి ఉండగా జూలై నుంచి పెరుగుతూ ఇప్పుడు రూ.14,350కు చేరింది. ఈ ధర కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన మిర్చికి పలకగా, నాన్ ఏసీ మిర్చి ధర గరిష్ఠంగా రూ.8,800గానే ఉండడం గమనార్హం.

విద్యుత్ ఏఈ, ఏఎల్ఎంపై సస్పెన్షన్ వేటు

రైతుల నుంచి లంచం తీసుకున్న ఘటనలో చర్యలు

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ జారీకి రైతుల నుంచి లంచం డిమాండ్ చేసిన విద్యుత్ ఉద్యోగులపై ఎన్పీడీసీఎల్ కొరడా ఝుళిపించింది. ఓ అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ), అసిస్టెంట్ లైన్‌మెన్(ఏఎల్ఎం)ను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఖమ్మం రూరల్ డివిజన్ తిరుమలాయపాలెం మండలం(సెక్షన్) చింతల్ తండా రైతులు నూతన వ్యవసాయ విద్యుత్ సర్వీస్ కోసం కొన్నాళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్నారు. అయితే, కనెక్షన్ మంజూరుకు ఏఈ ఆర్.భాస్కర్ రావు, ఏఎల్ఎం జగత్ జీవన్ రూ.లక్ష డిమాండ్ చేశారు. బేరసారాల అనంతరం రూ. 90 వేలు తీసుకున్నారు. ఈ వ్యవహారంపై అందిన ఫిర్యాదుతో విజిలెన్స్ విభాగం విచారించి నివేదిక సమర్పించగా ఇద్దరిని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, వీరిద్దరిపై శాఖాపరమైన విచారణ కూడా చేపడుతామని ఎస్ఈ శ్రీనివాసాచారి తెలిపారు. ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే 92810 33233 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. కాగా, ఏఈ, ఏఎల్ఎంకు జారీ అయిన సస్పెన్షన్ ఉత్తర్వులను మంగళవారం సాయంత్రం ఖమ్మం రూరల్ డివిజన్ డీఈ నాగేశ్వరరావు అందజేశారు. వీరి స్థానంలో ఒకటి, రెండు రోజుల్లో ఇన్‌చార్జిలను నియమించే అవకాశముంది.

పేదరికమే అర్హతగా పథకాలు



రేషన్‌కార్డు మంజూరు పత్రాలు అందజేస్తున్న మంత్రి పొంగులేటి, పక్కన కలెక్టర్ అనుదీప్ తదితరులు

- ఎవరికి ఓటు వేశారో అడిగేది లేదు..
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం: ఎవరికి ఓటు వేశారనేది పరిగణనలోకి తీసుకోకుండా కేవలం పేదరికమే అర్హతగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించగా, మూడు విడతల్లో మిగతా వారికి సైతం ఇస్తామని వెల్లడించారు. తిరుమలాయపాలెంలో రూ.3.30 కోట్లతో నిర్మించే బీటీ రహదారులకు మంగళవారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఆతర్వాత కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి రేషన్‌కార్డులు, కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేయగా మంత్రి మాట్లాడారు. తిరుమలాయపాలెంకు ఐటీఐ కేటాయించగా, 30 పడకల ఆస్పత్రిని రూ.26 కోట్లతో 50 పడకలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనుండగా తమ ప్రభుత్వానికి దీవెనలు అందించాలని పొంగులేటి కోరారు. కాగా, భూభారతి చట్టం ఈనెల 15 నుంచి పూర్తి స్థాయిలో అమల్లోకి వస్తుందని తెలిపారు.

చేత కాకపోతే రాజీనామా చేయండి

'జల్లేపల్లిలో డెంగీతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని తెలిసినా పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణలో అలసత్వం వహించడం సరికాదు... చేతకాకుంటే రాజీనామా చేయండి' అని ఎంపీడీఓ సిలార్‌సాహెబ్‌ను మంత్రి పొంగులేటి హెచ్చరించారు. జల్లేపల్లిలో సమస్యలపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో 'ఎన్నిసార్లు చెప్పినా తీరు మారదా.. నీ కోసం ప్రత్యేక జీఓ తేవాలా? నువ్వే పరిపాలన చెయ్.. లేకుంటే రాజీనామా చెయ్' అంటూ అసహనం వ్యక్తం చేశారు. కాగా, మండలంలోని బలరాంతండాకు చెందిన శివ కానరావడం లేదని ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆయన తల్లి లలిత మంత్రి దృష్టికి తీసుకురాగా, పోలీసులకు పొంగులేటి సూచనలు చేశారు.

విద్యారంగంలో కొత్త యుగం

ఖమ్మంరూరల్: యంగ్ ఇండియా పాఠశాలల ఏర్పాటుతో విద్యారంగంలో కొత్త యుగం ఆరంభం కానుందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం ఉన్నత పాఠశాల విద్యార్థినులకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంత్రి సైకిళ్లు పంపిణీ చేసి మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థినులకు సైకిళ్లు ఇస్తుండగా, వచ్చే ఏడాది నుంచి జూనియర్ కళాశాల విద్యార్థినులకు సైతం ఇస్తామని తెలిపారు. విద్యారంగంలో వెనుకబడిన ఈ ప్రాంతానికి తాము అధికారంలోకి వచ్చాక రూ.470 కోట్లు కేటాయించామని చెప్పారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల భవనాలకు రూ.280 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. గత ప్రభుత్వం తీరుతో విద్యారంగంలో సమస్యలు నెలకొనగా.. తమ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని పొంగులేటి పేర్కొన్నారు. సీఎం ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజనం తయారీకి సోలార్ ప్లాంట్లు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఇన్‌చార్జ్ డీఈఓ నాగపద్మజ, ఆర్డీఓ నర్సింహారావు, పాలేరు ప్రత్యేకాధికారి రమేష్, పీఆర్ ఈఈ మహేష్, డీఈ వేణుగోపాల్, తహసీల్దార్లు విల్సన్, పి.రాంప్రసాద్, ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, బెల్లం శ్రీనివాస్, బొర్రా రాజశేఖర్, కొప్పుల అశోక్, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల అశ్రద్ధతోనే లోపాలు

- విద్యాసంస్థల్లో తప్పు జరిగితే సిబ్బందిపై క్రిమినల్ కేసు
- భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్

ఖమ్మంమయూరిసెంటర్: ఏడాదికాలంగా గిరిజన సంక్షేమ శాఖ విద్యాసంస్థల్లో విద్యార్థులకు చదువు, ఆహారం, ఆరోగ్యం విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగలేదని, కానీ ఇటీవల సిబ్బంది నిర్లక్ష్యం, వార్డెన్లు, హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్ల అశ్రద్ధతో లోపాలు వెలుగు చూస్తున్నాయని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన గిరిజన సంక్షేమశాఖ విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు, హెచ్ఎంలు, వార్డెన్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ విద్యార్థులకు అల్పాహారం, భోజనాల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కల్లూరు పాఠశాలలో జరిగిన ఘటనను హెచ్చరికగా భావించి ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని తెలిపారు. ఇలాంటి పొరపాట్లు ఎక్కడ జరిగినా సిబ్బందిపై క్రిమినల్ కేసులు పెట్టి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పీఓ హెచ్చరించారు. వండిన ఆహారాన్ని ముందుగా ప్రిన్సిపాల్, హెచ్ఎం, వార్డెన్, ఉపాధ్యాయులు తిన్నాకే విద్యార్థులకు వడ్డించాలని పీఓ రాహుల్ స్పష్టం చేశారు.

▪ గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. ఖమ్మంలోని పీఎంహెచ్ బాలుర వసతిగృహాన్ని తనిఖీ చేసిన ఆయన విద్యార్థులతో మాట్లాడారు. బోధన, మెనూపై ఆరా తీయడమే కాక భవిష్యత్ లక్ష్యాలపై ఆరా తీశారు. అనంతరం పీఓ మాట్లాడుతూ సమయాన్ని వృథా చేయకుండా తీరిక సమయంలో పుస్తకాలు చదవాలని సూచించారు. అనంతరం గిరిజన భవనాన్ని సందర్శించిన పీఓ శుభకార్యాల నిర్వహణకు ఇచ్చేలా సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. తొలుత పీఓ ఖమ్మంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌ను సందర్శించి క్రయవిక్రయాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమాల్లో ఏపీఓ(జనరల్) డేవిడ్ రాజ్, డీడీ విజయలక్ష్మి, ఉద్యోగులు నారాయణరెడ్డి, యు.భారతిదేవి పాల్గొన్నారు.



ఖమ్మం వసతిగృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న పీఓ రాహుల్

▪ **ఖమ్మం సహకారనగర్:** కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలిపాక ఐటీడీఏ పరిధిలో అమలవుతున్న పథకాలపై చర్చించారు.

హాజరుకు వక్రమార్గాలు

- ఇద్దరు జీపీ కార్యదర్శులను సస్పెండ్ చేసిన కలెక్టర్
- ఎంపీఓ సహా మరికొందరికి నోటీసులు

ఖమ్మం సహకారనగర్/బోనకల్: గ్రామపంచాయతీల్లో పాలన పారదర్శకంగా సాగాలనే లక్ష్యంతో ప్రభుత్వం డీఎస్ఆర్(డెయిలీ శానిటేషన్ రిపోర్టు)ను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా కార్యదర్శులు విధినిర్వహణకు వెళ్లాక క్షేత్రస్థాయిలో యాప్ ద్వారా ఫొటోను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కానీ పలువురు పంచాయతీ కార్యదర్శులు విధులకు హాజరుకాకుండా, ఇంకొందరు ఆలస్యంగా వెళ్తూ డీఎస్ఆర్‌లో తప్పుడు హాజరు నమోదు చేస్తున్నట్లు అధికార యంత్రాంగం గుర్తించింది. ఈ మేరకు నివేదికను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి సమర్పించగా బోనకల్ మండలంలోని ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాక బోనకల్ మండల పంచాయతీ ఆఫీసర్(ఎంపీఓ)కు షోకాజ్ నోటీస్ జారీ చేశారు.

తప్పులు ఇలా...

ప్రతీ కార్యదర్శి కార్యస్థానానికి వెళ్లాక ఉదయం 8నుంచి పది గంటల మధ్య యాప్ ద్వారా తన ఫొటోను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కానీ కొందరు విధులకు గైర్హాజరవుతూ, ఇంకొందరు ఆలస్యంగా వెళ్తూ అధికారులు గుర్తించకుండా వక్రమార్గాలు ఎంచుకున్నారు. యాప్ ఇన్‌స్టాల్ చేసిన ఫోన్‌ను గ్రామంలో సిబ్బందికి అప్పగించి నిర్ణీత సమయానికి యాప్‌లో హాజరు నమోదు చేయిస్తున్నారు. ఈక్రమాన కొన్నిచోట్ల హాజరు నమోదు చేసే సిబ్బంది ఫొటోలు అందులో అప్‌లోడ్ అయ్యాయి. ఇక బోనకల్ మండలం తూటికుంట్ల, ఆళ్లపాడు పంచాయతీ కార్యదర్శులు బక్క సురేష్, మల్లాది శ్రీనివాసరావు కార్యస్థానానికి వెళ్లకుండా తమ పాస్‌ఫొటోతో హాజరు నమోదు చేసుకున్నట్లు తేలడంతో సస్పెండ్ చేశారు. ఇదే సమయాన కార్యదర్శులపై పర్యవేక్షణ లోపం కారణంగా బోనకల్ ఎంపీఓ వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రికి సైతం షోకాజ్ నోటీసు జారీ చేశారు.

కార్యదర్శుల్లో భయం భయం

జిల్లాలో కొందరు పంచాయతీ కార్యదర్శులు విధులకు వెళ్లకుండానే కార్మికుల ద్వారా యాప్‌లో హాజరు నమోదు చేయించుకుంటున్నారని ఇటీవల బయటపడింది. ఇన్నాళ్లు ఈ విషయం బయటకు రాకపోవడంతో ఇష్టమున్న సమయానికి వెళ్తూ విధులు కొనసాగించారు. కానీ ఇప్పుడు ఇద్దరిని సస్పెండ్‌చేయడంతో మిగతా వారిలో భయం పట్టుకుంది. అయితే, అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా మరో 30 గ్రామాల కార్యదర్శులు కూడా హాజరు ఇతరులతో నమోదు చేయించినట్లు తేలగా వీరికి త్వరలోనే షోకాజ్ నోటీసులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలం దొనబండ జీపీ కార్యదర్శి దుర్గ సైతం తప్పుడు హాజరు నమోదు చేయించడంతో ఎంపీఓ శ్రీనివాసరెడ్డి షోకాజ్ నోటీసు జారీచేసి వివరణ తీసుకున్నారు.

క్లుప్తంగా

ప్రతిభ చూపే సిబ్బందికి ప్రోత్సాహకాలు



సిబ్బందికి క్యాష్ రివార్డులు అందిస్తున్న సీపీ

ఖమ్మంక్రైం: విధినిర్వహణలో కష్టపడి పనిచేసే పోలీస్ సిబ్బందిని ప్రోత్సహిస్తామని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. గంజాయితో పాటు ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాల నియంత్రణలో ప్రతిభ కనబరిచిన టాస్క్‌ఫోర్స్ ఉద్యోగులు ఎస్.కే.ఖాసింఅలీ, వి.గోపి, ఎం.సతీష్‌కు సీపీ మంగళవారం క్యాష్ రివార్డులు అందజేసి మాట్లాడారు. జిల్లాలో 33కేసుల్లో 192 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోవడమేకాక 120 మంది నిందితులను అరెస్ట్ చేయడంలో ఈ సిబ్బంది కీలకంగా వ్యవహరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ ఉదయ్ కుమార్, ఎస్సైలు పాల్గొన్నారు.

డయల్ 100కు 4,151 ఫోన్లు

ఖమ్మంక్రైం: ప్రజల రక్షణ కోసం ఏర్పాటు చేసిన డయల్ 100కు జూలై నెలలో 4,151 మంది ఫోన్ చేశారని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. ఇందులో 113 ఫోన్లకు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదు చేశామని వెల్లడించారు. ఈ కేసుల్లో మహిళలపై వేధింపులు, చోరీలు, ప్రమాదాలు, అనుమానాస్పద మరణాలు, ఇతర కేసులు ఉన్నాయని తెలిపారు. అయితే, కొందరికి డయల్ 100పై అవగాహన లేక చిన్న చిన్న అంశాలకు ఫోన్‌చేస్తున్నారని, అలా కాకుండా అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే వినియోగించుకోవాలని సీపీ సూచించారు.

డ్రై డే నిర్వహణతో వ్యాధులకు చెక్



దెందుకూరు పీహెచ్‌సీలో సూచనలు చేస్తున్న డీఎంహెచ్ఓ కళావతిబాయి

మధిర/బోనకల్: సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేలా వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగులు డ్రై డే కార్యక్రమాలపై దృష్టి సారించాలని డీఎంహెచ్ఓ కళావతిబాయి సూచించారు. మధిర మండలం దెందుకూరు, బోనకల్ పీహెచ్‌సీలను మంగళవారం తనిఖీ చేసిన ఆమె వైద్యులు, సిబ్బందికి సూచనలు చేశారు. సీజనల్ వ్యాధుల కట్టడిపై దృష్టి సారిస్తూనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరిగేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే, వసతి గృహాలను నెలకోసారి సందర్శించి పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని చెప్పా రు. కాగా, మధిర మండలం మహదేవపురంలో పుతుంబాక రామసీతమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారులు సుభాష్, తదితరులు స్థలం సమకూర్చడమే కాక రూ.25 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానా భవనాన్ని డీఎంహెచ్‌ఓ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పృథ్వీ, స్రవంతి, ఉద్యోగులు వెంకటేశ్వర్లు, లంకా కొండయ్య, దానయ్య, స్వర్ణమార్త తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెటర్లను పరిచయం చేసుకుంటున్న కరస్పాండెంట్లు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని ఎస్ఆర్అండ్‌బీ జీఎన్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా స్థాయి రాజీవ్ స్మారక క్రికెట్ టోర్నీ మంగళవారం ప్రారంభమైంది. అండర్-12 బాలుర క్రికెట్ పోటీలను ఫైమా అధ్యక్షుడు మువ్వా శ్రీనివాసరావు, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు పి.రవిమారుత్, అశోక్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా టోర్నీ నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో సూరిబాబు, ఎం.డీ.జావిద్, డాక్టర్ చక్రి, టోర్నీ నిర్వాహకులు ఎం.డీ.మతిన్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,100	2,100
పెసలు	7,000	6,700
కందులు	6,150	6,000
ఏసీ మిర్చి	14,350	8,000
మిర్చి	8,500	7,000
పత్తి	7,850	6,800

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.18,052

లక్ష్యానికి మించి పత్తి సాగు



పత్తి రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు

- అంచనాల కంటే 5,484 ఎకరాల్లో అదనంగా పంట
- గత ఏడాదితో పోలిస్తే 14 వేల ఎకరాలు ఎక్కువ
- మిర్చి ధర పతనంతోనే పత్తి వైపు రైతుల మొగ్గు

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో ఈ ఏడాది పత్తి సాగు అంచనాలను మించింది. పత్తి 2,15,643 ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేయగా.. 2,21,127 ఎకరాల్లో విత్తనాలు నాటడం విశేషం. అంటే సాధారణ సాగుతో పోలిస్తే 5వేలకు పైగాఎకరాల్లో అదనంగా సాగవుతోంది. ఇక గత ఏడాది 2,07,945 ఎకరాల్లో పత్తి సాగు చేస్తే ఈసారి మరో 14 వేల ఎకరాలు పెరగడం రైతుల ఆసక్తిని తెలియచేస్తోంది. కాగా, సాగు విస్తీర్ణం నమోదు తర్వాత ఇది మరింత అవకాశముందని భావిస్తున్నారు. గత ఏడాది మిర్చికి సరైన ధర రాకపోవడం , పత్తి ధరను కేంద్రం పెంచడం రైతులు పత్తి వైపు చూపడానికి కారణంగా చెబుతున్నారు. అంతేకాక పత్తి సాగు తర్వాత రెండో పంటగా మొక్కజొన్న సాగుకు అవకాశముండడం ఇంకో కారణంగా తెలుస్తోంది.

జిల్లాలోని పలు మండలాల్లో గత ఏడాది, ఈ ఏడాది పత్తి సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)

మండలం	2024-25	2025-26
కామేపల్లి	11,386.02	15,226
రఘునాథపాలెం	16,049.19	21,723
తిరుమలాయపాలెం	12,201.30	15,002
చింతకాని	19,064.37	20,364
తల్లాడ	6,028.04	8,925
ఏన్కూరు	15,250.27	16,227
సింగరేణి	20,620.12	22,674

పలు మండలాల్లో పైపైకి...

జిల్లాలోని పలు మండలాల్లో పత్తి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. కామేపల్లి, రఘునాథపాలెం, కూసుమంచి, తిరుమలాయపాలెం, తల్లాడ, ఏన్కూరు, సింగరేణి మండలాల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది. ఒక్కో మండలంలో 2వేల నుంచి 4 వేల ఎకరాల వరకు కూడా సాగు విస్తీర్ణం పెరగగా.. మధిర, కల్లూరు తదితర మండలాల్లో మాత్రం స్వల్పంగా తగ్గింది. అయినా జిల్లా వ్యాప్తంగా పంట సాగు విస్తీర్ణం పెరిగింది.

పెరిగిన పత్తి ధర

కేంద్ర ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి పత్తి ధర పెంచింది. గత ఏడాది పత్తి ధర తేమ శాతం ఆధారంగా గరిష్టంగా రూ.7,521 ఉండగా, ఈ ఏడాది ఏకంగా రూ.8,110కు పెంచారు. తద్వారా క్వింటాకు రూ.589 అదనంగా లభించనుంది. ఇక పత్తి రెండు నుంచి మూడు పత్తితీతల తర్వాత నీటి వనరుల ఆధారంగా మొక్కజొన్న సాగు చేస్తారు. ఈ పంట రైతులకు లాభాలు కురిపించనుండడంతో ఎక్కువ మంది పత్తి సాగుకు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.

మిర్చి ధర పతనం

మిర్చి ధర పతనం కావడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించారు. క్వింటా రూ.20 వేల వరకు పైగా పలికిన మిర్చి ధర గత ఏడాది గణనీయంగా పడిపోయింది. ప్రస్తుతం సగటున రూ.12 వేలు దాటడం లేదు. విదేశాల ఆర్డర్లు లేకపోవడమే ఇందుకు కారణమని వ్యాపారులు చెబుతుండడం.. మిర్చి పెట్టుబడికి తగిన ధర దక్కక రైతులు నష్టపోయారు. దీంతో ఈ ఏడాది ఎక్కువ మంది పత్తి సాగుకు మొగ్గు చూపారు.

మిర్చితో నష్టం ఎదురైంది..



గత ఏడాది రెండెకరాల్లో మిర్చి సాగు చేస్తే దిగుబడి తగ్గడమే కాక పెరిగిన పెట్టుబడికి తగిన ధర రాలేదు. దీంతో ఈ ఏడాది నాలుగెకరాల్లో పత్తి సాగు చేస్తున్నా. నీటి వనరులు ఉండడంతో ఆ పంట తర్వాత మొక్కజొన్న సాగు చేయాలని నిర్ణయించుకున్నా.

– బానోత్ రామా, బీమరాజుపల్లి తండా

పత్తి సాగు విస్తీర్ణం పెరిగింది..



సహజంగా జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణం ఎక్కువగానే ఉంటున్నా గత ఏడాది కంటే ఈసారి పెరిగింది. గత ఏడాది మిర్చి ధరల ప్రభావం పత్తి సాగు పెరగడానికి దోహదపడింది. ప్రస్తుతం జిల్లా రైతులు సాగు చేసిన పత్తి పైర్లు ఆశాజనకంగానే ఉన్నాయి.

– ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

త్వరలోనే డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ

- అసంపూర్తి నిర్మాణాలు 'ఇందిరమ్మ' నమూనాలో పూర్తి
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో సిద్ధంగా ఉన్న 1,132 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులకు అందించేలా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి మంగళవారం ఆయన అధికారులతో సమీక్షించారు. ప్రారంభించనివి, పురోగతిలో ఉన్నవి మినహా నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో వసతులు కల్పించి పంపిణీ చేయాలని తెలిపారు. ఈ ప్రక్రియను పది రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇక వివిధ దశల్లో ఉన్న 383 ఇళ్లను సైతం లబ్ధిదారులకు కేటాయించి ఇందిరమ్మ ఇళ్ల నమూనాలో నిర్మించుకునేలా ప్రభుత్వ సాయం అందించాలని కలెక్టర్ సూచించారు. ఇంకా ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



తిరుమలాయపాలెం ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

మరింత మెరుగైన వైద్యం అందించాలి

తిరుమలాయపాలెం: ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకంతో వచ్చే వారికి అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. తిరుమలాయపాలెంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను మంగళవారం తనిఖీ చేసిన ఆయన వివిధ విభాగాలు, రిజిస్టర్లను పరిశీలించడమే కాక వైద్యసేవలపై గర్భిణులతో ఆరా తీశారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశమైన కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల వ్యాప్తి నేపథ్యాన పరిశుభ్రత ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే, అవసరమైన మందులు, వ్యాధి నిర్ధారణ కిట్లు అందుబాటులో పెట్టుకోవాలని తెలిపారు. వైద్యాధికారులు కృపాఉషశ్రీ, బొల్లికొండ శ్రీనివాసరావు, ప్రతాప్‌రెడ్డి, అమర్‌సింగ్, డీఏఓ పుల్లయ్య, తహసీల్దార్ విల్సన్, ఎంపీడీఓ సిలార్ సాహెబ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న యూఎస్‌పీసీ నాయకులు

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) ఆధ్వర్యాన మంగళవారం ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో యూఎస్‌పీసీ బాధ్యులు, టీఎస్‌యుటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుర్గాభవాని మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇస్తూనే బదిలీలు చేపట్టాలని, పెండింగ్ బిల్లులన్నీ విడుదల చేయాలన్నారు. అలాగే, రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతేకాక ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరు చేసి, బీఈడీ అర్హత కలిగిన వారికి కూడా ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంగా పదోన్నతి ఇవ్వాలని, 2008 కాంట్రాక్టు ఉపాధ్యాయులకు వేతనం, పెండింగ్ డీఏలను విడుదలకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. యూఎస్‌పీసీ నాయకులు రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, టి.వెంగళరావు, మన్సూర్, పి.నాగిరెడ్డి, పద్మ, షమి, వెంకన్న, రాంబాబు, రాందాస్, నాగేశ్వరరావు, సురేష్, ప్రశాంతి, వలీ, ఉద్దండ్, మనోహర్ రాజు, రాజశేఖర్ పాల్గొనగా... సీపీఎం, మాస్‌లైన్ నాయకులు నున్నా నాగేశ్వరరావు, జి.వెంకటేశ్వరరావు, అశోక్, వెంకటేష్ తదితరులు సంఘీభావం తెలిపారు.

బీసీ బిల్లుపై పలువురి రాజకీయాలు

మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



మాట్లాడుతున్న పోటు రంగారావు, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లును రాజకీయ పార్టీలు తమ లబ్ధి కోసం ఉపయోగించుకుంటున్నాయని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు విమర్శించారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిల్లుకు ఆమోదంపై కేంద్రప్రభుత్వం దొంగాట ఆడుతోందని తెలిపారు. కాగా, రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రప్రభుత్వ నిధులు ఆగినందున వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో తమ పార్టీ బూర్జువా పార్టీలతో పొత్తు పెట్టుకోదని.. వామపక్ష పార్టీలు బూర్జువా పార్టీలతో అవగాహన, ఒప్పందాలు లేకుండా కలిసొస్తే ఐక్యంగా పోటీ చేస్తామన్నారు. కాగా, గాజాపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఈనెల 7న ఖమ్మంలో నిర్వహించే ర్యాలీకి తమ పార్టీ మద్దతు ఉంటుందని రంగారావు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు ఆవుల అశోక్, సీవై.పుల్లయ్య, ఆర్.శివలింగం, జి.రామయ్య, బందెల వెంకయ్య, కొల్లేటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి



ఘటనా స్థలంలో నుజ్జునుజ్జయిన ఆటో

కొణిజర్ల: మండలంలోని పల్లిపాడు సమీపాన రైస్ మిల్ ఎదురుగా ఆటోను లారీ ఢీకొట్టగా ఆటోడ్రైవర్ మృతి చెందాడు. ఖమ్మం రోటరీనగర్‌కు చెందిన సయ్యద్ సైదులు(45) తన ఆటోలో మంగళవారం రాత్రి ఖమ్మం నుండి వైరా వెళ్తుండగా పల్లిపాడు సమీపాన వైరా నుంచి ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో నుజ్జునుజ్జు కాగా, సైదులు తీవ్రగాయాలతో అందులో ఇరుక్కుపోయి మృతి చెందాడు.

ద్విచక్రవాహనదారుడికి తీవ్రగాయాలు

తల్లాడ: తల్లాడ మండలం నరసింహారావుపేట సమీపాన కంకర మిల్లు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. జగన్నాధపురం గ్రామానికి చెందిన తుమ్మ వెంకటేశ్వర్లు(65) ద్విచక్ర వాహనంపై ఏన్కూరు వెళ్లి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గాయపడ్డాడు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తుండగా, 108వాహనంలో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

విత్తన లోపంతో నష్టపోయామని ఫిర్యాదు

తల్లాడ: మొక్కజొన్న విత్తన లోపంతో దిగుబడి రాక నష్టపోయామని తల్లాడ మండలం మండలం ముద్దునూరుకు చెందిన పలువురు రైతులు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. గ్రామ రైతులు 25మంది 2024 నవంబర్, డిసెంబరులో 80ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ఆడ మగ విత్తనాలను విత్తన కంపెనీ ఏజెంట్ దేవరపల్లి జగన్నాధం సరఫరా చేయగా, 40 క్వింటాళ్లుగా చెప్పిన దిగుబడి 5నుంచి 10క్వింటాళ్లు దాటలేదు. దీంతో ఒక్కో రైతుకు ఎకరానికి రూ.50 వేల మేర నష్టం వాటిల్లగా కంపెనీ నుంచి జూన్ 1వ తేదీకల్లా పరిహారం ఇప్పిస్తానని ఏజెంట్ జగన్నాధం హామీ ఇచ్చాడు. ఇప్పటివరకు స్పందన లేకపోగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. ఫిర్యాదు చేసిన రైతుల్లో బి.కృష్ణారావు, మంకెన గోపాల్, సాదం లక్ష్మణ్‌రావు, జి.శ్రీనివాసరావు, హరీష్, కృష్ణ, కొండలరావు, నరసింహారావు, చంటి, ప్రసాద్, బాబురావు, సైదు రెడ్డి, మన్నె రామారావు తదితరులు ఉన్నారు.

4కేజీల గంజాయి స్వాధీనం

మధిర: ఒడిశా నుంచి తీసుకొచ్చి మధిర చుట్టుపక్కల ప్రాంతాల్లోఅమ్మేందుకు సిద్ధం చేసిన నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు మధిర టౌన్ సీఐ రమేష్ తెలిపారు. ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని భూక్యా అనూష్ నాయక్, కుంచం గోపీచంద్, మరో మైనర్ బాలుడు తీసుకొచ్చినట్లు అందిన సమాచారంతో మధిర టౌన్ ఎస్ఐ ఎం.కిషోర్ కుమార్ ఆధ్వర్యాన మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈమేరకు రూ.2లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకోవడమే కాక కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చీటింగ్ కేసు నమోదు

ఇల్లెందురూరల్: షోరూం నిర్వహణ విషయంలో ఓ వ్యక్తిపై పోలీసులు మంగళవారం చీటింగ్ కేసు నమోదు చేశారు. ఖమ్మానికి చెందిన ఈశ్వర్రప్రగడ రంగనాథ్ ఇల్లెందు మండలం సుభాష్‌నగర్‌లో బైక్ షోరూం ప్రారంభించాడు. నిర్వహణ బాధ్యతను ఇల్లెందుకు చెందిన యాలం దయాసాగర్‌కు అప్పగించగా యజమానికి తెలియకుండా రూ. 12.31 లక్షల విలువైన బైక్‌లను విక్రయించి నగదు సొంతానికి వాడుకున్నాడు. అందులో కొంత చెల్లించినా, రూ.8.82లక్షలు చెల్లించకపోవడంతో రంగనాథ్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

చెల్లని చెక్కులు జారీ చేసిన కేసుల్లో జైలుశిక్ష

సత్తుపల్లి: అప్పు తిరిగి చెల్లించే క్రమాన జారీ చేసిన చెక్కులు చెల్లకపోవడంతో ఓ వ్యక్తికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ సత్తుపల్లి ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి బి.ఎస్.ఎన్ సుమబాల మంగళవారం తీర్పు చెప్పారు. సత్తుపల్లికి చెందిన తోట గణేష్ వద్ద 2011 జనవరిలో పెనుబల్లి మండలం కారయిగూడెంకుచెందిన రాధాకృష్ణకు రూ.9 లక్షల అప్పు తీసుకున్నాడు. తిరిగి 2012 ఆగస్టులో రూ.9 లక్షలకు చెక్కు జారీ చేసినా అది చెల్లలేదు. దీంతో న్యాయవాది పిన్నం జానకీరామరావు ద్వారా కేసు దాఖలు చేయించగా రాధాకృష్ణకు ఏడాది జైలు శిక్ష విధించడమే కాక రూ.13 లక్షలను గణేష్‌కు చెల్లించాలంటూ తీర్పు వెలువరించారు. నగదు చెల్లించని పక్షంలో మరో ఏడాది జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని తెలిపారు. ఇక సత్తుపల్లి మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన హసావత్ చిట్టెమ్మ వద్ద ఏపీలోని వత్సవాయికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు దందమూడి బసవ పూర్ణచందర్ రావు తీసుకున్న అప్పు కింద చెక్కు జారీ చేయగా ఖాతాలో సరిపడా నగదు లేకపోవడంతో బౌన్స్ అయింది. ఈమేరకు న్యాయవాది మాయర రమేష్ ద్వారా చిట్టెమ్మ కోర్టులో కేసు దాఖలు చేశారు. విచారణ అనంతరం పూర్ణచందర్‌కు నాలుగు నెలల శిక్ష విధించడమే కాక రూ.4లక్షలు చెల్లించాలని సత్తుపల్లి ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి బీఎస్ఎన్.సుమబాల తీర్పు చెప్పారు. నగదు చెల్లించని పక్షంలో మరో ఎనిమిది నెలలు జైలు శిక్ష అమలు చేయల్సిందిగా తీర్పులో వెల్లడించారు.

నానో యూరియాతో తగ్గనున్న ఖర్చు



పత్తి పంటను పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

మధిర: పంటలకు గుళికల యూరియా బదులు ద్రవ రూపంలో ఉండే నానో యూరియా వినియోగంతో ఖర్చు తగ్గడమే కాక ఫలితాలు బాగుంటాయని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. మధిర మండలం ఆత్కూర్‌లో పలువురు రైతులు సాగు చేసిన పత్తి పంటను మంగళవారం పరిశీలించిన ఆయన నానో యూరియా, డీఏపీపై అవగాహన కల్పించారు. నానో యూరియాతో మొక్కకు పోషకాలు ఎక్కువ మోతాదులో అందుతాయని తెలిపారు. కాగా, పత్తిలో రసం పీల్చే పురుగుల నివారణకు పసుపు రంగు జిగురు అట్టలను ఎకరాకు 8 – 10 చొప్పున ఏర్పాటు చేసుకోవాలని, ఉధృతి ఉంటే పురుగు మందులను వేపనూనెతో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సాయిదీక్షిత్, ఏఈఓ జిష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ దీక్షలో జిల్లా కాంగ్రెస్ నేతలు



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల, పక్కన ఎమ్మెల్యేలు, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్/వైరా: బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలనే డిమాండ్‌తో కాంగ్రెస్ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన నిరసన దీక్షలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎమ్మెల్యేలు మాలోతు రాందాస్‌నాయక్, కోరం కనకయ్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పాల్గొనగా కేంద్రం తీరును వారు ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, నాయకులు వనం ప్రదీప్త చక్రవర్తి, గజ్జల వెంకన్న, జెర్రిపోతుల అంజనీ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ సీఎంఓగా ప్రవీణ్‌కుమార్

ఖమ్మం సహకారనగర్: విద్యాశాఖలో కమ్యూనిటీ మొబిలైజేషన్ అండ్ మీడియా ఆఫీసర్(సీఎంఓ)గా వి.ప్రవీణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు ఇన్‌చార్జ్ డీఈఓ నాగపద్మజ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం చింతకాని మండలం పొద్దుటూరు హైస్కూల్‌లో విధులు నిర్వర్తిస్తున్న ప్రవీణ్‌కుమార్ ఒకటి, రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

బెటాలియన్ కానిస్టేబుల్ బలవన్మరణం

రెండు రోజుల తర్వాత గుర్తించిన వైనం



అల్లం బాలరాజు (ఫైల్)

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం గంగారం ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో విధులు నిర్వర్తించే కానిస్టేబుల్ కుటుంబ కలహాలకు తోడు మద్యానికి బానిసవడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. ములుగు జిల్లా కేంద్రానికి చెందిన అల్లం బాలరాజు(40) సత్తుపల్లి మండలం బేతుపల్లిలో అద్దె ఇంట్లో నివాసముంటూ గంగారం బెటాలియన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఏడాది క్రితం భార్యాభర్తల మధ్య వివాదం చోటు చేసుకోవడంతో భార్య, పిల్లలతో కలిసి పుట్టింటికి ఉంటుంది. ఆపై మద్యానికి బానిసైన బాలరాజు మద్యం మత్తులోనే రెండు రోజుల క్రితం నివాసముండే గదిలో ఉరి వేసుకున్నట్లు తెలుస్తోంది. మంగళవారం ఇంటి నుంచి దుర్వాసన వస్తుండగా ఇంటి యజమాని ఇచ్చిన సమాచారంతో బెటాలియన్ సిబ్బంది పరిశీలించడంతో విషయం వెలుగు చూసింది. ఘటనపై సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఖమ్మం క్రైం: ఖమ్మంలో మూడు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెద్దగోపతికి చెందిన గుండ్ల రామకృష్ణ(22) ఖమ్మంలోని మొబైల్ షాప్‌లో పనిచేస్తుండగా, స్వగ్రామానికి బైక్‌పై వెళ్లే సమయాన వైరా వైపు నుంచి బైక్‌పై వస్తున్న సామినేని చంద్రమోహన్ అతి వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన రామకృష్ణకు చికిత్స చేయిస్తుండగా సోమవారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై ఆయన తండ్రి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



మోకాళ్ల పాపారావు (ఫైల్)

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కిన్నెరసాని క్రీడా పాఠశాలలో మూడేళ్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయుడు మోకాళ్ల పాపారావు(50) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడికి భార్య పద్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామమైన ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం పాటిమీదగుంపునకు తరలించారు. పాఠశాల హెచ్ఎం రామారావు, తోటి ఉపాధ్యాయులు రూ. 30 వేల ఆర్థికసాయాన్ని మృతుడి భార్యకు అందజేశారు.

విద్యార్థులకు కొనసాగుతున్న చికిత్స

కల్లూరు: కల్లూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో సోమవారం అల్పాహారం తిన్నాక 33 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం విదితమే. ఇందులో ఐదుగురికి మంగళవారం కల్లూరు ప్రభుత్వాస్పత్రిలో పరీక్షలు నిర్వహించారు. వైద్యులు రమేష్, నవ్యకాంత్ వారిని పరీక్షించి సూచనలు చేశారు. కాగా, మార్కెట్ చైర్మన్ భాగం నీరజాదేవి, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, పసుమర్తి చందర్‌రావు, భాగం ప్రభాకర్ విద్యార్థినులను పరామర్శించడమే కాక హాస్టల్‌లో పరిశీలించి విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.